క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కష్ణశర్మ పూజలు నిర్వహించారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో జీవీఎంసీ 95వవార్డు పురుషోత్తపురం మరిడిమాంబ కాలనీలో రూ.18లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది స్థలాన్ని కబ్జా చేయాలని చూశారని, ఎన్ని అడ్డంకులు వచ్చినా సామాజిక భవనం పూర్తి చేశామన్నారు. సామాజిక భవనం కోసం కృషి చేసిన 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, చందు యాదవ్‌లను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జి, యలమంచిలి శ్రీను, జొన్నాడ సాయికృష్ణ, అబోతు శ్రీను, విజయ్, మరిడిమాంబ కాలనీ సర్వాసితులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.64వేల జరిమానా

సింహాచలం: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా వారికి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు రూ. 64వేలు అపరాధ రుసుం విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. పెందుర్తి జంక్షన్, చినముషిడివాడ, నాయుడుతోట, వేపగుంట, నరవ తదితర ముఖ్యకూడళ్లలో డంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష

సింహాచలం: రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి నాణ్యమైన వైద్యం అదించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు అన్నారు. 525,526 సచివాలయాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగావాన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడం, క్యాంపు నిర్వహణలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అవసరమైన ప్రతీ ఒక్కరికీ వైద్య సదుపాయం అందేలా చేయాలన్నారు.

ఆటోవాలా.. ఆనంద హేల

- వాహన మిత్రపై ఆనందం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతల వెల్లువ



ఆటోవాలాలు, క్యాబ్ డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఆదుకున్నారని సంబరపడుతున్నారు.వాహన మిత్ర కింద లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. దీంతో వారి కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. వాహనాల ట్యాక్స్ చెల్లించడానికి ఇబ్బందులు తప్పాయని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

–పరవాడ/ సింహాచలం/సబ్బవరం

మండలం	లబ్ధిదారులు	జమ అయిన నగదు
సబ్బవరం	1273	రూ.1.27 కోట్లు
పరవాడ	507	రూ.50.70లక్షలు
పెందుర్తి	825	రూ.82.50 లక్షలు

ఐదు విడతల్లో రూ.50 వేలు వచ్చింది



వాహన మిత్ర ద్వారా ప్రభుత్వం అందించిన రూ.10 వేలు నా బ్యాంకు ఖాతాలో జమయ్యింది.నాకు ఇప్పటి వరకూ ఐదు విడతలుగా రూ. 10 వేల చొప్పున రూ.50 వేలు ప్రభుత్వం అందించింది.నేను వ్యవసాయంతో పాటు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. నాకు ఇద్దరు ఆడ పిల్లలు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుంది.

–లగిశెట్టి దేముడు బాబు, వంగలి,సబ్బవరం మండలం.

ఆర్థిక ప్రోత్సాహం



ఆటో నడుపుకుంటూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలతో పాటు అన్ని వృత్తుల వారికి ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తుంది.ఇప్పటి వరకూ వాహన మిత్ర ద్వారా 5 విడతల్లో రూ.50 వేలు అందించింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం మా కుటుంబానికి చేయూతను అందిస్తుంది.

– జట్టి రామునాయుడు, వంగలి ,సబ్బవరం మండలం.

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.పది వేలు అందించడం నాకెంతో ఆనందంగా ఉంది. జగనన్న పంపిన డబ్బును దుర్వినియోగం చేయను. ట్యాక్స్ కట్టడంతో పాటు ఆటో నిర్వహణకు ఉపయోగిస్తాను. మమ్మల్ని గుర్తించిన జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– పలక ముని, డ్రైవర్, తానాం

జగనన్న వెంటే నడుస్తా..



వాహనమిత్ర పథకంతో నా కుటుంబానికి అండగా నిలుస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాను. ఆర్థిక సాయం ఎంతో మంది ఆటోవాలాలకు ఉపయోగదాయకం. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఆటో మెయింటెనెన్స్‌కు ఉపయోగిస్తా. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్న ఒక్కరికే సాధ్యం. ఆయన వెంటే నడుస్తా.

– కిలపర్తి అప్పలనాయుడు, డ్రైవర్, వాడచీపురుపల్లి

ఆటో నిర్వహణకు ఉపయోగిస్తా..



వాహన మిత్ర ద్వారా సీఎం జగనన్న మంజూరు చేసిన ఆర్థిక సాయంతో ఆటో మెయింటెనెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వినియోగిస్తా. తమ సాధక బాధలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలి. అతనికి మా మద్దతు ఉంటుంది.

– షేక్ సుభాన్, వాడచీపరుపల్లి

ఆటోడ్రైవర్లకు మేలు చేశారు



నేను వరుసగా ఐదో ఏడాది వావాన మిత్ర ద్వారా రూ.10 వేలు అందుకున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజంగా ఆటోడ్రైవర్ల పాలిట దేముడు. 2019 వరకు మా పరిస్థితిని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జగన్ మోహన్‌రెడ్డి మమ్మల్ని గుర్తించారు. ఇచ్చిన మాట తప్పకుండా వాహనమిత్ర కింద రూ.10 వేలు ఇచ్చారు. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనే ముఖ్యమంత్రి అవుతారు.

– గురునాథ్, ఆటో డ్రైవర్, పెదగాడి, పెందుర్తి మండలం

ఆరోగ్యవంతమైన సమాజమే
సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- రావలమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



రోగులకు వైద్య పరీక్షలు అందిస్తున్న వైద్య సిబ్బంది



రావలమ్మపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అంతకాపల్లి సచివాలయం పరిధిలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది,వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తిస్తున్నారని చెప్పారు. వారికి టోకెన్లు అందించి గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరంలో ఉచిత సేవలు అందిస్తున్నామన్నారు. ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు,ఎంపీడీవో రమేష్ నాయుడు.తహసీల్దార్ సత్యనారాయణ, గుల్లేపల్లి పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి వెంకటరావు, సీడీపీవో లలిత్ కుమారి, ఎంఈవోలు లక్ష్మణరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

320 మందికి వైద్య పరీక్షలు

పరవాడ: ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు అన్నారు. స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. బడుగు బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందన్నారు. 320 మంది రోగులకు డాక్టర్ కనక అప్పారావు వైద్య చికిత్సలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దారు పి.కనకారావు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, పంచాయతీ రాజ్ ఇంజినీర్ రామారావు, పార్టీ నాయకులు సూరాడ ముత్యాలరావు, ఎం.అప్పన్న, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

421మందికి వైద్య పరీక్షలు



గొరపల్లిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి

సింహాచలం: పెందుర్తి మండలం గొరపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ మధుపాడ నాగమణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 421మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 36 మందిని వైద్యసేవలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో గొరపల్లి ప్రెసిడెంట్ గొరపల్లి శ్రీను, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, తహసీల్దార్ శ్యామ్, ఈవోఆర్డీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో దశాబ్దాల కల సాకారం



రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్,మేయర్ హరి వెంకట కుమారితో కలిసి శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.7.75 కోట్లతో పనులు

సబ్బవరం: దీర్ఘకాలంగా ఉన్న నంగినారపాడు ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష రోడ్డు విస్తరణతో నెరవేరనుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి మంత్రి అమర్‌నాథ్ మంగళవారం రాత్రి శంకుస్థాపన చేసారు. ఈ రోడ్డును కొత్తూరు నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకూ నాలుగు దశల్లో విస్తరించనున్నట్టు చెప్పారు. కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని 10 రోజుల్లో పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమై యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. రోడ్డు పూర్తయితే పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. పరిసర ప్రాంతాలన్నీ నివాస యోగ్య ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినప్పటికీ కరోనా రావడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయన్నారు. ఈ రోడ్డు పూర్తి చేసిన తర్వాతే వచ్చి ఓట్లు అడగడం జరుగుతుందన్నారు.

మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, పార్టీ వార్డు ఇన్‌చార్జి మహలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు, సచివాలయ కన్వీనర్ సర్వసిద్ధి బోరయ్య, నాయకులు బొట్ట ముత్యాలరావు, నారపిన్ని అప్పలరాజు,చట్టి తాతారావు, మళ్ల నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- వెన్నలపాలెం జగనన్న కాలనీ సందర్శన



వెన్నలపాలెం జగనన్న కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన జగనన్న కాలనీల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. వెన్నలపాలెంలో నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీని కలెక్టర్ రవి మంగళవారం సందర్శించారు. కాలనీలో నిర్మాణ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా కాలనీలో రూ.41.95 లక్షలతో చేపట్టిన డ్రైనేజీలు, రహదారులు, ముఖద్వార నిర్మాణ పనులు ఈ నెల 8 నాటికి పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, గృహ నిర్మాణశాఖ పీడీ రమామణి,మండల ప్రత్యేక అధికారి వీర్నానాయుడు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.విజయలక్ష్మి, డీఈలు ప్రసాద్, ఏవీవీఎస్ఎన్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ, హౌసింగ్ ఏఈ రెడ్డి, పీఆర్ ఇంజినీర్ జి.రామారావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కుమారుడిని అరెస్ట్ చేయాలని నిరసన

పరవాడ: రైతు ర్యాలీపై కర్కశంగా వ్యవహరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడిని తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘ ఐక్య వేదిక పిలుపు మేరకు ఫార్మాసిటీలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గనిశెట్టి మాట్లాడుతూ ర్యాలీ చేస్తున్న రైతులను తన వాహనంతో ఢీకొట్టి నలుగురు రైతుల, విలేకరి మృతికి కారణమైన సహాయ మంత్రి కుమారుడిపై ఏడాది గడుస్తున్న ఎలాంటి చర్యలు చేపట్టలేదని నిరసన వ్యక్తం చేశారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలు, విద్యుత్ సంస్కరణల చట్టాలనుమార్పు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా కేంద్రం రైతు సంఘాలతో ఎలాంటి చర్చలు జరపలేదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయని పక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా కన్వీనర్ ఎ.బాలకృష్ణ, నాయకులు రొంగలి అప్పారావు, పి.తాతబాబు, ఎం.సన్యాసిరావు, శ్రీను, అక్కు నాయుడు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రామారావు

పరవాడ: పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజు వారీ ఆహారంగా తప్పని సరిగా చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిని మార్చుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు విజేత, తులసీమణి మాట్లాడుతూ ఆరు తడి పంటల కింద తక్కువ నీరు తక్కువ పెట్టుబడులతో చిరు ధాన్యాలను సాగు చేయవచ్చునని సూచించారు. చిరు ధాన్యాలు అధిక పోషణ విలువలు కలిగిన పంటలని .. పలు రుగ్మతలను దూరం చేయడానికి దోహదం చేస్తాయన్నారు. చిరుధాన్యాలు పండించడానికి ఆసక్తి కలిగిన రైతులకు విత్తనాలు అందజేస్తామని చెప్పారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి మాట్లాడుతూ వరి, కాయగూరల పంటల్లో పాటించాల్సిన మెలకవులను రైతులకు వివరించారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులపై బుధవారం నుంచి సోషల్ ఆడిట్ ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో రమేష్‌నాయుడు చెప్పారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో 16వ విడత సోషల్ కన్వర్జెన్సీ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి మాట్లాడుతూ గతేడాది సుమారు రూ.12 కోట్లతో చేపట్టిన పనులకు ఆడిట్ నిర్వహించడం జరుతుందన్నారు. ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకూ అన్ని పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్ఆర్పీ సూర్యనారాయణ, ఏవో ఎస్ బాబూరావు, పలు శాఖల ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు,వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలో స్టీల్‌ప్లాంట్‌కు తరలిరండి

ఆరిలోవ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం గురువారం కూర్మన్నపాలెంలో నిర్వహించనున్న చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆరిలోవ అంబేడ్కర్ కూడలి, బాలాజీనగర్ సంత ప్రాంతాలలో మంగళవారం ప్రచారం చేశారు. చలో స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా జరిగే బహిరంగ సభను ప్రజలు జయప్రదం చేయాలన్నారు. ఈ సభకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరు కానున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి సిద్ధపడిందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు, ప్రజలు పోరాడుతున్నప్పటికీ ప్రధాని నిర్ణయం మార్చుకోకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రజలంతా కలసి పోరాటం చేసి కాపాడుకోవాలన్నారు.

ఎఫ్‌సీఐలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం అధ్యాపకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇక్కడి అధ్యాపకులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎఫ్‌సీఐలో పేద విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం సుమారు 90 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వారిలో 14 మంది బాలికలున్నట్లు తెలిపారు. వీరిలో పదో తరగతి నుంచి పీజీ, బీటెక్ చదువుకున్నవారు కూడా ఉన్నారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నామన్నా రు. ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి లోగోను గురువారం ఆవిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రవి రాఘవన్, ఎస్.పార్థసారథి, బి.కుముదిని పాల్గొన్నారు.